శ్రీ అష్ట లక్ష్మీ స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ అష్ట లక్ష్మీ స్తోత్రమ్ - భావార్థముతో.

ఆదిలక్ష్మి:

01. సుమనసవందిత సుందరి మాధవి
చంద్రసహోదరి హేమమయే
మునిగణవందిత మోక్షప్రదాయిని
మంజులభాషిణి వేదనుతే।
పంకజవాసిని దేవసుపూజిత
సద్గుణవర్షిణి శాంతియుతే
జయ జయ హే మధుసూదన కామిని
ఆదిలక్ష్మి సదా పాలయ మాం॥

దేవతలచే పూజింపబడేదానివి, సజ్జనులకు వందనీయురాలివి, అందగత్తెవి, చంద్రునికి చెల్లెలివి, నిలువెల్లా బంగారమైన దానివి, మునిగణములచే మ్రొక్కబడేదానివి, మోక్షాన్ని ప్రసాదించే దానివి, మనసుకి సంతోషం కలిగేలా మాట్లాడేదానివి, వేదాలచే కీర్తింపబడే దానివి, తామరపువ్వులో ఉండే దానివి, మంచి గుణాలను వరాలుగా ఇచ్చేదానివి, ప్రశాంతమైన మనస్సుగల దానివి యైన ఓ మధుసూదనుని కామినీ! ఆదిలక్ష్మి! నీకు జయమగు గాక. నన్ను దయతో పాలింపుము.

మాధవునకు సతీమణివి, చంద్రునకు సహోదరివి, ఋషులచే, వేదములచే. దేవతలచే స్తుతింపబడుదానవు, మధుర భాషిణివి, కమలంపై ఆసీనురాలైన శ్రీ ఆదిలక్ష్మి కి నమస్కరిస్తున్నాను.

ధాన్యలక్ష్మి:

02. అయి కలికల్మషనాశిని కామిని
వైదికరూపిణి వేదమయే
క్షీరసముద్భవ మంగళరూపిణి
మంత్రనివాసిని మంత్రనుతే।
మంగళదాయిని అంబుజవాసిని
దేవగణాశ్రిత పాదయుతే
జయ జయ హే మధుసూదన కామిని
ధాన్యలక్ష్మి సదా పాలయ మాం॥

అమ్మా! వేదోదిత రూపిణివి, కాంక్షారూపిణివి, కలిదోషం పోగొట్టే దానివి, వేదమే స్వరూపమైన దానివి, పాలకడలిన పుట్టిన పావన మూర్తివి, మంత్రమే ఆవాసముగా కలదానివి, మంత్రమునందే మనస్సు కలదానివి, శుభాలు చేకూర్చేదానివి, పద్మంలో ఉండేదానివి, దేవతలందరూ ఆశ్రయించే పాదాలు కలదానివీ, హే మధుసూదన మనోహారిణీ ధాన్యలక్ష్మి! నన్ను పాలించుము.

మా గృహమును ధాన్యముతో నింపి, కలి దోషాలను నిర్మూలించి, పాల కడలిలో ప్రభవించి, మంత్ర స్వరూపిణివై, మధుసూదనుని అర్ధాంగివైన శ్రీ ధాన్యలక్ష్మి కి నమస్కరిస్తున్నాను..

ధైర్యలక్ష్మి:

03. జయ వరవర్ణిని వైష్ణవి భార్గవి
మంత్రస్వరూపిణి మంత్రమయే
సురగణపూజిత శీఘ్రఫలప్రద
జ్ఞానవికాసిని శాస్త్రనుతే।
భవభయహారిణి పాపవిమోచని
సాధుజనాశ్రిత పాదయుతే
జయ జయ హే మధుసూదన కామిని
ధైర్యలక్ష్మి సదా పాలయ మాం॥

శ్రేష్ఠమైన వర్ణములతో శోభిల్లేదానివి, విష్ణు సంబంధితివి, భృగు మహర్షి కుమార్తెవు, మంత్ర స్వరూపమైన దానివి, దేవతలచే పూజింపబడే దానివి, తక్షణమే సత్ఫలితాలిచ్చే దానివి, జ్ఞానాన్ని వికసింపచేసే దానివి, శాస్త్రములచే స్తుతింపబడే దానివి, జనన మరణ భయాన్ని పోగొట్టే దానివి ఓ మురారి ముద్దురాలా! ధైర్యలక్ష్మి! నన్ను పాలించుము.

మాకు ధైర్యమును ప్రసాదించి, కోరికలను జ్ఞానమును ప్రసాదించి, మా పాపములను తొలగించి, విజయమును కటాక్షించే శ్రీ ధైర్యలక్ష్మికి నమస్కరిస్తున్నాను.

గజలక్ష్మి:

04. జయ జయ దుర్గతి నాశిని కామిని
సర్వ ఫలప్రద శాస్త్రమయే
రథగజతురగ పదాతిసమావృత
పరిజన మండిత లోకనుతే।
హరిహరబ్రహ్మసుపూజిత సేవిత
తాప నివారిణి పాదయుతే
జయ జయ హే మధుసూదన కామిని
గజలక్ష్మి రూపేణ పాలయ మాం॥

కోరదగినదానివి, సమస్త ఫలాలను ఇచ్చేదానివి, దుర్గతిని నాశనం చేసే దానివి, శాస్త్రములందు మనసు గలదానివి, నీ చుట్టూరా రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, పదాతులూ అను చతురంగ బలాలు కలదానివి, హరి హర బ్రహ్మల చేత, ఇంద్రుడి చేత సేవింపబడేదానివి, తాపత్రయాన్ని నివారించే పాదాలు కలదానివి, ఓ మధుసూదనుని ఇల్లాలా! గజలక్ష్మి! నన్ను పాలించుము.

గజరాజులచే అభిషేకించబడుతూ, విధి ప్రాతికూల్యతను తొలగించి, కోరికలను ప్రసాదించి, రథ గజ తురగ పదాతి దళాలచే పరివేష్టింపబడి - హరి హర బ్రహ్మాదులచే స్తుతించబడుతూ, శ్రమను తొలగించే శ్రీ గజలక్ష్మి కి నమస్కరిస్తున్నాను.

సంతానలక్ష్మి:

05. అయి ఖగ వాహిని మోహిని చక్రిణి
రాగవివర్ధిని జ్ఞానమయే
గుణగణవారిధి లోకహితైషిని
స్వరసప్తభూషిత గాననుతే।
సకల సురాసుర దేవ మునీశ్వర
మానవ వందిత పాదయుతే
జయ జయ హే మధుసూదన కామిని
సంతానలక్ష్మి సదా పాలయ మాం॥

అమ్మా! ఏనుగులచే పూజింపబడేదానివి, మోహింప చేసే దానివి, సంసార చక్రమును త్రిప్పేదానివి, ప్రేమానురాగములను పెంచేదానివి, జ్ఞానమూర్తివి, సద్గుణగుణాల సముద్రానివి, లోకాలకి మేలు కోరే దానివి, 'సరిగమపదని' అను సప్త స్వరములతో కూడిన, దేవతల సంగీతముచే కీర్తించబడే దానివి, దేవ దానవులు, ఋషులు, మానవులు మొదలగు వారందరిచేత నమస్కరింపబడే పాద పద్మములు కలదానివి, ఓ మహావిష్ణు మనోహారిణీ! సంతానలక్ష్మి! నన్ను సదా పాలించుము.

గరుడుని అధిరోహించి, ప్రేమ జ్ఞాన స్వరూపిణివై, సప్త స్వర రూపిణివై, దేవతలు, రాక్షసులు, మునీశ్వరులు, మానవులు నమస్కరించే పాద పద్మములు కల శ్రీ సంతాన లక్ష్మికి నమస్కరిస్తున్నాను.

విజయలక్ష్మి:

06. జయ కమలాసని సద్గతిదాయిని
జ్ఞాన వికాసిని గానమయే
అనుదిన మర్చిత కుంకుమధూసర
భూషిత వాసిత వాద్యనుతే।
కనకధరాస్తుతి వైభవ వందిత
శంకర దేశిక మాన్య పదే
జయ జయ హే మధుసూదన కామిని
విజయలక్ష్మి సదా పాలయ మాం॥

కమలములో కూర్చుండుదానివి, సద్గతిని ఇచ్చేదానివి, బుద్ధిని వికసింప చేసే దానివి, సంగీత రూపిణివి, భక్తులు నిత్యమూ చేసే పూజాపరమైన కుంకుమ దూపముచే అలంకరింపబడి ఉండేదానివి, మేలైన వాయిద్యములచే స్తుతించ బడేదానివి, జగద్గురు శంకరాచార్యుల చేత 'కనకధారాస్తవ' మనే పేర స్తుతించ బడేదానివి, యైన ఓ విష్ణుమూర్తి ప్రియురాలా! విజయలక్ష్మి! నన్ను పాలించుము.

అపారమైన కరుణతో, మాకు సర్వత్రా జయమును ప్రసాదించి, శ్రీ శంకరా చార్యులు కనకధారా స్తోత్రములో నీ పాదములను ఆరాధించిన శ్రీ విజయలక్ష్మి కి నమస్కరిస్తున్నాను.

విద్యాలక్ష్మి:

07. ప్రణత సురేశ్వరి భారతి భార్గవి
శోకవినాశిని రత్నమయే
మణిమయ భూషిత కర్ణవిభూషణ
శాంతి సమావృత హాస్యముఖే।
నవనిధి దాయిని కలిమలహారిణి
కామిత ఫలప్రద హస్తయుతే
జయ జయ హే మధుసూదన కామిని
విద్యాలక్ష్మీ సదా పాలయ మాం॥

శచీ సరస్వతులచే పూజించబడినదానివి, దుఃఖాన్ని నాశనం చేసేదానివి, రత్న స్వరూపిణివి, మణిమయములైన కర్ణకుండలాలు ధరించి శాంతిని కలిగించే చిరునవ్వుతో కూడిన ముఖం కలదానివి, నవనిధులను ఇచ్చేదానివి, కలికాల పాపాలు హరించేదానివి, కోరిన వరాలిచ్చే చిరునవ్వుల్ని చిందించే దానివి యైన ఓ కమలాక్షుని కాంతామణీ! విద్యాలక్ష్మీ! నన్ను పాలించుము.

అజ్ఞానమును తొలగించి, జ్ఞానమును ప్రసాదించి, మణులచే కూర్చబడిన కర్ణాభరణములతో ఉన్న ప్రశాంతమైన ముఖముతో కలి దోషములను తొలగించి అన్ని కోరికలను నెరవేర్చే శ్రీ విద్యా లక్ష్మికి నమస్కరిస్తున్నాను.

ధనలక్ష్మి:

08. ధిమిధిమి ధింధిమి ధింధిమి-దింధిమి,
దుంధుభి నాద సుపూర్ణమయే
ఘుమఘుమ ఘుంఘుమ ఘుంఘుమ ఘుంఘుమ,
శంఖ నినాద సువాద్యనుతే।
వేద పురాణేతిహాస సుపూజిత,
వైదిక మార్గ ప్రదర్శయుతే
జయ జయ హే మధుసూదన కామిని
ధనలక్ష్మి సదా పాలయ మాం॥

"ధిమి ధిమి దింధిమి" వంటి దేవ దుందుభీ నాదాలతో నిండి యుండేదానివి, "ఘుంఘుమ ఘుంఘుమ" మ్మని మ్రోగే శంఖ ధ్వనులచేత కీర్తించబడేదానివి, వేదాలు, పురాణాలు, ఇతిహాసాల చేత పూజింపబడేదానివి, వైదిక ధర్మాలాచరించే వారికి దర్శనమిచ్చేదానివి యైన హే జగన్నాథుని ఇల్లాలా! జగన్మాతా! ధనలక్ష్మి! నీకు జయమగు గాక! దయతో నన్ను పాలించుము.

శంఖము, ఇతర వాద్యములచే నాదరూపిణిగా, నాట్య స్వరూపిణిగా ఆరాధింపబడే, ఐశ్వర్య ప్రదాతగా, పురాణములు, వేదములచే ఆరాధించబడే శ్రీ ధనలక్ష్మికి నమస్కరిస్తున్నాను.

// ఇతి శ్రీ అష్టలక్ష్మి స్తోత్రమ్ సంపూర్ణమ్ //

- - - = - - -

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

